



పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

గుంటూరులో అభివృద్ధి పనులు తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పలు అభివృద్ధి పనులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా బుధవారం తనిఖీ చేశారు. కాకు మానువారి తోట ప్రాంతం, బీఆర్‌స్టేడి యం, పీవీకే నాయుడు పెద మార్కెట్, అంబేడ్కర్ భవన్, స్టడీ సెంటర్, కృష్ణా నగర్ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఆడిటోరియం, గోరంట్లలో నీటి పథకం, మానస సరోవరం, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, నల్లపాడు చెరువు, ఐ.టి.సి రోడ్డులోని పలు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. మానస సరోవరం, నల్లపాడు చెరువు అత్యుత్తమ పర్యాటక ప్రదేశాలుగా విరాజిల్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నగరంలో చేపడుతున్న కార్యక్రమాలను జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, పర్యవేక్షక ఇంజినీర్ సుందరరామిరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఆంధ్రా ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ ఎం.వి.చారి ప్లాంట్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్లాంటులోని అన్ని విభాగాలను కలెక్టర్‌కు చూపించి వాటి పనితీరును వివరించారు. బీఆర్ స్టేడియంలో విద్యుద్దీపాలు, కాలువల అవసరమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, సిటీ ప్లానర్ రాంబాబు, జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, తహసీల్దారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





మానస సరోవరం, బీఆర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అర్హులకే.. అవకాశం



పేదరికాన్ని రూపుమాపి తద్వారా రాష్ట్రాన్ని సంపన్నవంతం.. ఆరోగ్యవంతం.. ఆనందంగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం పీ-4 ప్రవేశపెట్టి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అయితే ఇందులో అర్హులకే అవకాశం దక్కేలా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ ప్రకారం మూడు నెలలుగా ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. పథకం ప్రారంభించినప్పుడు బంగారు కుటుంబాల ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఎంపికకు ఐదు అంశాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. సచివాలయ సిబ్బంది వాటి ఆధారంగానే ఇంటింటి సర్వేను మరోమారు చేపట్టి అర్హుల జాబితా ను యాప్‌లో అప్‌లోడ్‌తో పాటు, తొలి జాబితాలో చేర్చిన కొన్ని కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. ఎట్టకేలకు పీ-4 పథకానికి అర్హులైన బంగారు కుటుంబాల జాబితా సిద్ధమైంది.

- బంగారు కుటుంబాల జాబితా సిద్ధం
- ఐదు అంశాల ప్రామాణికంగా పీ-4 సర్వే
- ముమ్మరంగా మార్గదర్శకుల అనుసంధానం



(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకునేలా.. వారిని సమాజం దత్తత తీసుకుని ఆదుకునేలా పీ-4ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకం ఫలాలు అర్హులైన వారికే అందాలని, దాని కోసం ఐదు అంశాలు ప్రామాణికంగా ఇంటింటి సర్వేను చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఆ కుటుంబాలను మార్గదర్శకాలకు అనుసంధానం చేసే ప్రక్రియను సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం కుటుంబాల మ్యాపింగ్ పూర్తయిందని, వారి వారి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మార్గదర్శకులను అటాచ్ చేస్తున్నామని, ఆ ప్రక్రియ మరో వారం రోజుల్లో ఓ కొలిక్కి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సచివాలయాల వారీగా బంగారు కుటుంబాల జాబితాను గతంలో గ్రామా లు, మండలాలు, మున్సిపాలిటీలు వారీగా సిద్ధం చేశారు. అయితే ఎంపికలో సరైన మార్గదర్శకాలు పాటించకపోవడంతో జిల్లాలో అనర్హులు పెద్ద సంఖ్యలో చేరారని తేలింది. ఈ పరిస్థితుల్లో అర్హులను ఎంపిక చేసేలా ప్రభుత్వం ఐదు అంశాలను నిర్దేశించింది. ఈ ప్రకారం బంగారు కుటుంబాల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలని, ఇదంతా కూడా పారదర్శకంగా (మిగతా 6వ పేజీలో)

తగ్గిన బంగారు కుటుంబాలు

బాపట్ల జిల్లాలో సర్వే అనంతరం తుది జాబితాలో 51,304 బంగారు కుటుంబాలకు చోటుదక్కింది. పథకం ప్రకటించిన తొలినాళ్లలో జిల్లా వ్యాప్తంగా 70,983 కుటుంబాలకు పీ-4లో చోటు కల్పించారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో 15,179 కుటుంబాలను అనర్హులుగా తేల్చారు. జిల్లాలో 5,158 మందిని మార్గదర్శకులుగా గుర్తించారు. గుంటూరు జిల్లాలో గతంలో 78 వేలు బంగారు కుటుంబాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 48 వేలకు పరిమితమైంది. పల్నాడు జిల్లాలో 76800 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. మూడు జిల్లాల్లో గతానికి ఇప్పటికీ బంగారు కుటుంబాల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది.

ఏఎన్‌యూ వీసీగా.. ఆచార్య సత్యనారాయణరాజు

హిందూ బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా సేవలు



ఏఎన్‌యూ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య ఎస్.వెంకట సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ సత్యనారాయణరాజు నియామకానికి సంబంధించిన జీవో 91ను బుధవారం జారీ చేశారు. 14 నెలల తర్వాత ప్రభుత్వం పూర్తి స్థాయి ఉపకులపతిని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల వీసీలుగా ఐఐటీ, ఎన్‌ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఆచార్యులకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావును కాదని ఆచార్య సత్యనారాయణరాజును నియమించింది. సత్యనారాయణరాజు ప్రస్తుతం వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎంటమాలజీ ఆచార్యులుగా (ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్) సేవలందిస్తున్నారు. ఏఎన్‌యూ ఉపకులపతిగా ఆయన బుధవారం నుంచి మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన ఉపకులపతి ఆచార్య సత్యనారాయణరాజును పలువురు అభినందించారు.

పరిశోధనలు.. అవార్డులు..

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఆచార్య సత్యనారాయణ రాజు విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెరుగైన పరిశోధనలు చేస్తూ పలు అవార్డులను అందుకున్నారు. ఆయన 2017లో ఎన్విరాన్మెంటల్ కన్జర్వేషన్ అవార్డును, మహిమ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును, ఉత్తమ ఏఎన్‌ఓ అవార్డును, 2018లో డాక్టర్ ఆనంద్ ప్రకాష్ అవార్డును, ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డును, 2019లో అగ్రికల్చరిస్ట్ అచీవ్మెంట్ అవార్డును అందుకున్నారు. అలాగే ఆయన న్యూఢిల్లీలోని ఫెలో ఆఫ్ ఎంటమాలజీకల్ సొసైటీ ఆఫ్ ఇండియాగా పనిచేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సభ్యులుగా కూడా పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు ప్రచురించడంతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించారు.

పెదకాకాని ఎంపీపీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం

త్వరలో కలెక్టర్‌కు తీర్మాన నోటీసు

పెదకాకాని, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని ఎంపీపీ తులిమిల్లి శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. వైసీపీకి చెందిన ఎంపీపీని గద్దె దించి మండల ప్రజా పరిషత్ కార్యాలయంపై టీడీపీ జెండా ఎగురవేయాలని చూస్తున్నారు. పెదకాకాని మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో పెదకాకాని, నంబూరు గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులు అత్యధికంగా ఉన్నారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు 6 స్థానాల్లో గెలు పొందారు. 15 స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో నంబూరు గ్రామానికి చెందిన ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యు లు టీడీపీలో చేరారు. మరో ఇద్దరు టీడీపీ నాయకులతో సత్సంబంధా లు కొనసాగిస్తున్నారు. దీంతో టీడీపీకి మద్దతుగా 10 మంది, వైసీపీకి తరఫున 11 మంది ఎంపీటీసీలు ఉన్నట్లవుతోంది. పెదకాకానికి చెందిన మహిళా ఎంపీటీసీ టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో టీడీపీ మ్యాజిక్ ఫిగర్ దాటుతోంది. దీనికి తోడు.. వైసీపీలోనే ఉంటూ మరి కొంతమంది ఎంపీటీసీలు పరోక్షంగా మద్దతిస్తామని టీడీపీ నాయకులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా నంబూరు చెందిన ఇద్దరు ఎంపీటీసీ సభ్యుల నిర్ణయమే కీలకంగా మారనుంది.

త్వరలో కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు

ఎంపీపీపై అవిశ్వాస తీర్మాన నోటీసు కలెక్టర్‌ను కలిసి త్వరలో ఇవ్వనున్నట్లు సమాచారం. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి.. ఎంపీటీసీ సభ్యుల మెజార్టీ మేరకు అవిశ్వాసంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ లోపు ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ, కొప్పురావూరు ఎంపీటీసీ సభ్యుడు కామినేని శ్రీనివాసరావును నియమించే అవకాశాలున్నాయి. అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు నివేదించి, అక్కడి నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు కొత్త ఎంపీపీని ఎన్నుకోనున్నారు. ఈ ప్రక్రియ అంతా మరో నెలలో పూర్తిచేయాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అడుగుకో గుంత

- ఆ రోడ్డులో ప్రయాణం.. నరకయాతనే
- ఎవరికీ పట్టని మూడు కిలోమీటర్ల రోడ్డు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డులో ప్రయాణం అంటే వాహన చోదకులకు హడలిపోవాల్సిందే. రోడ్డు మొత్తం మూడు కిలోమీటర్లు ఉంటే దాదాపు ప్రతి పది అడుగులకు ఒక గుంత ఉంది. కొన్ని చోట్ల అయితే దాదాపు ఆరు అడుగుల వరకు రోడ్డు కొట్టుకుని పోయి గుంతలతో నిండి ఉంది. భారీ వాహనాల తాకిడికి రోడ్డు మొత్తం అధ్వానంగా మారింది. నల్లపాడు నుంచి చిలకలూరిపేట రోడ్డులో ఉన్న జాతీయ రహదారిని కలిపే మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు దుస్థితిది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకునే వారేలేరు. తాజాగా కొన్ని రోజుల నుంచి పడుతున్న వర్షం కారణంగా రోడ్డు మరింత దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వంలో అయినా కష్టాలు తీరతాయనుకుంటే ఇప్పటి వరకు రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.





నల్లపాడు నుంచి బైపాస్‌రోడ్డుకు ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే...

టాస్క్‌ఫోర్స్

ఇక అక్రమార్కుల ఆటకట్టు

- గంజాయి, పేకాటలపై ప్రత్యేక నిఘా
- ఒక్కో సబ్ డివిజన్‌కు పోలీసుల నియామకం
- ఒకవైపు సమాచార సేకరణ.. మరోవైపు దాడులు



గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారింది.. అయినా అసాంఘీక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారులు మారారు.. కానీ అక్రమార్కుల తీరులో మార్పు లేదు. క్షేత్రస్థాయిలో పోలీసు అధికారుల అలసత్వం.. విధి నిర్వహణలో తలమునకలు.. వంటి కారణాలతో కొంతమంది అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో అక్రమార్కుల ఆట కట్టించేందుకు పోలీస్‌శాఖ సమాయత్తమైంది. ఆయా అక్రమార్కుల ఆట కట్టించడమే లక్ష్యంగా ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సేకరించడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరుపు దాడులకు దిగేలా టాస్క్‌ఫోర్స్ పనిచేసేలా ఎస్పీ కార్యాచరణను సిద్ధం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినా గతంలో మాదిరిగానే పోలీస్ శాఖలో ఆశించిన ఫలితాలు రావడంలేదని ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో అవినీతి అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ హయాంలో గంజాయి యథేచ్ఛగా లభ్యం కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రస్థాయిలో ఈగల్ విభాగం ఏర్పాటు చేసి దాదాపుగా అరికట్టింది. అయినా అక్కడక్కడ గంజాయి రవాణా, వినియోగం సాగుతూనే ఉంది. అలాగే రేషన్ బియ్యం మాఫియా చెలరేగుతోంది. రేషన్ మాఫియాకు అధికార పార్టీ నేతల అండదండలు ఉంటుండడంతో క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది మాఫియా ఇచ్చే మామూళ్లతో కళ్ళు మూసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లాడ్జీలు, హోటళ్లలో వ్యభిచార కార్యకలాపాలతో పాటు జూదం నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తులు చాప కింద నీరులా కార్యకలాపాలు సాగిస్తున్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై పోలీస్ శాఖ నిఘా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆయా కార్యకలాపాల కట్టడికి ఎస్పీ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గతంలో రౌడీషీటర్ల పీచమణిచేందుకు యాంటీగూండా స్క్వాడ్, అత్యవసర పరిస్థితులను అధిగమించేందుకు క్విక్ రియాక్షన్ టీం, దోపిడీలు, దొంగతనాలు అరికట్టేందుకు సీసీఎస్ వంటి విభాగాలు ఉన్నట్లుగానే ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ వంటి నిఘా వర్గాల్లో అత్యధిక కాలం పనిచేసి, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడంలో అనుభవం ఉన్న సిబ్బందితో టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారు. ఒక్కో సబ్ డివిజన్‌కు ఒకరు లేదంటే ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించారు. ఈ క్రమంలో ఆయా కార్యకలాపాలను అరికట్టడంలో అవినీతికి, పక్షపాతానికి తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలంటూ ఎస్పీ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఆదేశించారు.

రహదారులకు మహర్దశ

భారీగా నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదగా ఉన్న రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ రోడ్ల(ఎండీఆర్)ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్లలో జరగనున్న కృష్ణా పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని అమరావతి రోడ్డుని పలు సెక్షన్లలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. 7 నుంచి 9వ కిలోమీటరు, 9/8 నుంచి 10/6, 11 నుంచి 11/6, 18/8 నుంచి 21/30 వరకు ఉన్న రాష్ట్ర రహదారిని మెరుగుపరిచేందుకు రూ.3 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. మొత్తంగా ఈ రహదారిలో నాలుగు కిలోమీటర్ల మేర పటిష్ట పరచబోతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తెనాలి - మంగళగిరి రోడ్డులో 3/8 నుంచి 6/6(ఎస్‌హెచ్ - 316) కిలోమీటర్ వరకు రోడ్డుని అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు, గుంటూరు - హనుమాన్‌పాలెం(నంది వెలుగు)రోడ్డులో 26 నుంచి 29 /800 కిలోమీటర్ వరకు అభివృద్ధికి రూ. 3 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. మొత్తం రూ.11కోట్ల నిధులను రహదారుల అభివృద్ధి కేటాయించిందని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

జిల్లా రోడ్ల అభివృద్ధికి నిధులు ఇలా..

జిల్లాలో తొమ్మిది ఎండీ రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చేబ్రోలు నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వయా ముట్లూరులో 10.25 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.4.50 కోట్లు, తాడికొండ- రాయపూడి రోడ్డులో ఆరు కిలోమీటర్ల పొడవునా మెరుగుపరిచే పనులకు రూ. 2.80 కోట్లు, ఫిరంగిపురంలోని కంటెపూడి రోడ్డులో 7 నుంచి 13వ కిలోమీటర్ వరకు రోడ్డు అభివృద్ధికి రూ. 2.50 కోట్లు, తెనాలి - సిరిపురం రోడ్డులో 0 నుంచి నాలుగో కిలో మీటర్ వరకు అభివృద్ధి పనులకు రూ.3.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అలానే జీహెచ్ రోడ్డు నుంచి కొల్లిపర వయా దంతలూరు రోడ్డు అభివృద్ధికి రూ.3.30 కోట్లు, దుగ్గిరాల - పెదపాలెం రోడ్డులో 3.80 కిలోమీటర్ల పొడవునా రెండు భాగాల్లో పనులకు రూ.2.20 కోట్లు, మంగళగిరి - రాయపూడి రోడ్డులో అభివృద్ధి పనులకు రూ. 3.40 కోట్లు, దుగ్గిరాల - నంబూరు రోడ్డులో ఆరు కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.3.10 కోట్లు, ఓఎం రోడ్డు నుంచి వల్లూరు వయా జీజీపాలెం - రావిపాడు, వంగిపురం రోడ్డు అభివృద్ధికి రూ.6.70 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

సూపర్ జీఎస్టీ డేటా అప్‌లోడ్ చేయాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశాలు

గుంటూరు(విద్య), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్(ఎస్.జి.ఎస్.ఎస్) కార్యక్రమాల డేటా పోర్టల్‌లో తక్షణం అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారంలో నగరంలోని హిందూ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అమరావతిరోడ్డులోని పలు విద్యాసంస్థల్లో జీఎస్టీపై అవగాహన సదస్సుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆయా శాఖలు చేపడుతున్న కార్యక్రమాలు అప్‌లోడ్ చేయడంలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. జీఎస్టీ తగ్గింపు ధరలపై ఈ నెల 10, 11 తేదీల్లో ఏసీ కళాశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అధ్యాపకులు

పిన్నెల్లి సోదరుల విచారణ వాయిదా

మాచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వెంకట్రామిరెడ్డి బుధవారం మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో పోలీసుల విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. ఈ నెల 10వ తేదీకి విచారణ వాయిదా పడింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి సోదరుల జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులు ఏ6, ఏ7 నిందితులుగా ఉన్నారు. ముందస్తు బెయిల్ పిటీషన్ సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతుండడంతో పిన్నెల్లి సోదరులు అందుబాటులో లేరు. దీంతో విచారణను పోలీసులు వాయిదా వేశారు.

అనుమానాస్పద మృతి కేసులో వివరాలు లభ్యం

యడ్లపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపాలెం - సంగంగోపాలపురం మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసులో.. వివరాలను పోలీసులు సేకరించారు. మృతుడు గుంటూరులోని సంగడిగుంటకు చెందిన షేక్ రహీం(47)గా గుర్తించారు. చెంఘీజ్‌ఖానపేట గ్రామానికి చెందిన స్నేహితుడు రాళ్ళబండి శివనాగేంద్రబాబుతో కలిసి అతను సోమవారం రాత్రి ఆటోలో గుంటూరు నుంచి చెంఘీజ్‌ఖాన్ పేటకు బయలుదేరాడు. శివనాగేంద్రబాబు అతివేగం కారణంగా.. ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో వెనుక కూర్చున్న రహీం రోడ్డుపై పడడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే శివనాగేంద్రబాబు రహీం మృతదేహాన్ని అక్కడే వదిలివేసి ఆటోను తీసుకుని గ్రామంలోకి పారిపోయాడు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ శివనాగేంద్రబాబును పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అంతకముందు మృతుని తండ్రి షేక్ సైదా రాత్రి చిలకలూరిపేటలోని మార్చురీకి వచ్చి కుమారుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

రెండు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

● రూ.10లక్షల విలువైన బంగారం, నగదు స్వాధీనం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జూన్, సెప్టెంబరులో జరిగిన వివిధ చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ఎంవీ చరణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. జూన్‌లో పట్టణానికి చెందిన దాసరి ప్రణీత గృహంలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన పనిమనిషి అమరారపు భూలక్ష్మిని, సెప్టెంబరు 4న డాక్టర్ కడియాల వెంకటేశ్వరావు వైద్యశాల వద్ద కుడిమల ఏడుకొండలు గృహంలో చోరీ చేసిన పాత నేరస్తుడు షేక్ బాజీని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడు బాజీపై పదికి పైగా పిక్ పాకెట్ కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.10 లక్షల విలువైన నగదు, బంగారపు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ వంశీకృష్ణ, నేర విభాగ కానిస్టేబుళ్ల వీరాంజనేయులు, మురళీకృష్ణను సీఐ అభినందించారు.

అదనపు రవాణా చార్జీలపై లేఖాస్త్రం

● సమస్యను పరిష్కరించాలని ఎస్పీ, రవాణా శాఖ కమిషనర్‌కు మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశాలు



విజయ సునీత, మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి రవాణా విషయంలో లారీ యూనియన్ల నాయకులు అధిక చార్జీలు డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయాన్ని మిర్చి ఎగుమతిదారులు తమ దృష్టికి తీసుకొచ్చారని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం రవాణా శాఖ రాష్ట్ర కమిష నర్, జిల్లా ఎస్పీకి వేర్వేరుగా లేఖలు రాశారు. ఈ విషయంలో లారీ యూనియన్లతో మాట్లాడి సమస్యని పరిష్కరించాల్సిందిగా కోరారు. మార్కెటింగ్ డైరెక్టర్ లేఖల దృష్ట్యా పోలీసు, రవాణా శాఖల ఉన్నతా ధికారులు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు రంగంలోకి దిగే అవకా శాలున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

యూనియన్ల వద్దే అసలు సమస్య..

ఈ సంవత్సరం ఫిబ్రవరి 22న సీఎం చంద్రబాబునాయుడు వద్ద జరిగిన సమావేశంలో మిర్చి ట్రేడర్లు ప్రధానంగా రవాణా చార్జీలు ఇతర మార్కెట్లతో పోల్చితే ఇక్కడ పెచ్చుగా ఉన్నాయని విన్నవించారని మార్కెటింగ్ కమిషనర్ తన లేఖలో పేర్కొన్నారు. దీని వల్ల అటు ఎగుమతిదారులకు, ఇటు రైతులకు నష్టం కలుగుతుం దన్నారు. ఇతర ఏఎంసీలతో పోల్చితే దాదాపుగా ఇక్కడి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయి విషయంలో రూ.35 వేల వ్యత్యాసం ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం లారీ యూనియన్‌లేనని ఆరోపిం చారు. యజమానులు లారీలు కిరాయికి పెట్టడానికి సిద్ధంగా ఉన్నప్ప టికీ.. యూనియన్ నాయకులు అడ్డుకొంటున్నారన్నారు. ఇలాంటి సిండికేట్ వ్యవహారాలను నియంత్రించాలని ఇప్పటికే సీఎం ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. వాటిని ఏడెనిమిది నెలల పాటు పాటించి మళ్లీ సమస్య పునరావృతం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ విజయ సునీత విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్య వారంలో పరిష్కారం కావాలి. లేకుంటే సీజన్‌లో సమస్య తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. అసలే గత సీజన్‌లో ధర లేక మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొన్న రైతులు ఇప్పుడు కాస్త మెరుగైన ధర క్వింటాకు రూ.15 వేలు పొందుతున్నారు. ఎగుమతులు నిలిచిపోతే ధర పతనం అవుతుంది. అంతేకాకుండా రాబోయే మిర్చి సీజన్ పైనా దాని ప్రభావం పడుతుంది.

ఆరు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 6 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040, ఎడమ కాలువ ద్వారా 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,942, 6 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 48,414, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 1,01,018 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,01,018 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వర ద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు.. మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2,35,419 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,17,350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,380, పశ్చిమ డెల్టాకు 7,508, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

స్వార్థ రాజకీయం కోసమే జగన్ విశాఖ పర్యటన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు తిరస్క రించినా జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి రాలేదని, విశాఖపట్నంలో శాంతిభ ద్రతలకు విఘాతం కలిగించే ఉద్దేశంతోనే వైసీపీ అధినేత పర్యటన ప్లాన్ చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ ప్రజా సమస్యల కంటే రాజకీయ హడావుడి సృష్టించడమే ఈ పర్యటన అసలు ఉద్దేశమని పేర్కొన్నారు. వైద్య కళాశాలలపై చేస్తున్న రాద్ధాంతాన్ని ఆయన ఖండించారు. జగన్‌మోహన్‌రెడ్డికి పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానం, ప్రైవేటీ కరణకు మధ్య తేడా తెలియక అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. వైద్య విద్యలో నాణ్యత పెంచి, మరిన్ని సౌకర్యాలను ప్రజలకు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొస్తున్న పీపీపీ విధానాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతా రాహిత్యమన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లా డుతూ.. వచ్చే నెలలో విశాఖపట్నంలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు జరగనుందన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి అలజడి పర్యటనలను జగన్ చేపడుతున్నారని విమర్శించారు. ఉనికి కోల్పోతున్న వైసీపీ గ్రాఫ్‌ను పెంచుకోవడం, క్యాడర్‌ను కాపాడుకోవడానికి యాత్ర ల పేరుతో.. డ్రామాలు చేస్తున్నారన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు కమ్మెుత కోటిరెడ్డి, అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి, చిత్రంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

అలజడి సృష్టించడానికే జగన్ కుట్రలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శాంతిభద్రత లకు విఘాతం కలిగించే ఒకే ఒక్క ఉద్దేశంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను ప్లాన్ చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ హడావుడి సృష్టించడమే ఈ పర్యటన అసలు ఉద్దేశమన్నారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో వైద్య కళాశాలలపై జగన్, వైసీపీ విమర్శలను ఆయన ఖండించారు. జగన్ రెడ్డి పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానం, ప్రైవేటీకరణ మధ్య తేడా తెలియక అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ విధానంలో కళాశాలల్లోని సీట్లు, ఫీజులు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ అంశమూ ఉండదని తెలిపారు. జగన్‌రెడ్డికి ఈ నిజాలు తెలిసినా.. కావాలనే వైద్య కళాశాలలపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తెనాలి క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెనాలి - విజయవాడ ప్రధాన రైలు మార్గంలో పెదవడ్లపూడి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం గుర్తుతెలియని 35 సంవత్సరాల యువకుడు రైలు నుంచి జారి మృతి చెందాడని జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని, మృతుని చేతిపై వినోద్ అన్న పేరుతో పచ్చబొట్టు, ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రాత్రి 12 గంటలకు తీసుకున్న ప్లాట్‌ఫాం టిక్కెట్ లభించాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామం వద్ద టాటా మ్యాజిక్ ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. మృతి చెందిన వ్యక్తి ఎర్రబాలెం గ్రామానికి చెందిన పున్నా శంకర్‌గా గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

అర్హులకే.. అవకాశం

(5వ పేజీ తరువాయి)

జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు మూడు నెలల పాటు జరిగిన ఇంటింటి సర్వే ఇటీవలే ఓ కొలిక్కి వచ్చింది. దీంతో బంగారు కుటుంబాల జాబితాపై స్పష్టత వచ్చింది. దీంతో పీ-4కు అనర్హులుగా తేలుస్తూ ఆయా కుటుంబాల వివరాలను యాప్‌లో నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టారు. గతంలో ఒక్కో మార్గదర్శకుడికి కనీసం పది బంగారు కుటుంబాలను అప్పగించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే ప్రస్తుతం వారి ఇష్టం ఆధారంగా ఒక బంగారు కుటుంబాన్ని కూడా పీ-4 పథకం కిందకు చేర్చనున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన...

తుది జాబితాలో చోటు దక్కించుకున్న బంగారు కుటుంబాలకు ప్రభుత్వం వైపు నుంచి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై తొలి దశ కసరత్తుపై యంత్రాంగం దృష్టి సారించింది. సాంకేతిక కారణాల వల్లనో లేక అవగాహన లేమితో వారు దరఖాస్తు చేసుకోకపోవడం వల్లనో పథకాలకు దూరంగా ఉంటే వారిని ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలో చేర్చనున్నారు. మలి దశలో భాగంగా మార్గదర్శకుల ద్వారా వారికి ఏ విధమైన తోడ్పాటు అందించాలో ఓ స్పష్టతకు రానున్నారు. తర్వాత మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను ఒకే వేదిక మీదకు తెచ్చి అనుసంధానం చేసే కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులకు అధికారులు అప్పగించారు. ప్రస్తుతం పీ-4 జాబితా తుది రూపు తీసుకోవడం, మ్యాపింగ్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో తర్వాత ప్రక్రియలపై వడివడిగా అడుగులు పడుతున్నాయి.

ముగ్గురు ఎంపీడీఓలకు స్థాన చలనం

● యుగ కీర్తికి కమిషనరేట్‌లో పోస్టింగ్

గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ముగ్గురు ఎంపీడీఓలకు పరిపాలన సౌలభ్యం కోసం జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు బుధవారం స్థాన చలనం కల్పించారు. కాకుమాను ఎంపీడీఓ యుగ కీర్తిని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యాలయానికి డెప్యూటేషన్‌పై పంపారు. పల్నాడు జిల్లా రెంటచింతల ఎంపీడీఓ స్వరూప రాణిని నాదెండ్లకు డెప్యూటేషన్ వేశారు. నాదెండ్ల ఎంపీడీఓ శ్రీనివాసరావును రెంటచింతలకు బదిలీ చేశారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం

మంగళగిరి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబాలెం బసవతారక నగర్ వద్ద మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ర్యాష్ డ్రైవింగ్‌తో ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టాడు. కారులోని కుటుంబం అత్యవసర పనిమీద కావలి వెళ్లాల్సి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయారు. మద్యం మత్తులో తూగుతున్న డ్రైవర్ కొద్ది దూరం వెళ్లిన తర్వాత బసవతారక నగర్ కూడలి మలుపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న టిఫిన్ బండితోపాటు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఆ వెంటనే చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. కారులో డ్రైవర్ సహా మొత్తం నలుగురు ఉన్నారని, అందరూ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

బీ ఫార్మసీ, ఫార్మా డీ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం బీ ఫార్మసీ రెండవ సెమిస్టర్ (రెగ్యులర్), ప్రథమ సెమిస్టర్ (సప్లిమెంటరీ)పరీక్షలతో పాటు ఫార్మా డీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీ ఫార్మసీ పరీక్షలకు 18 కేంద్రాలు, ఫార్మా డీ పరీక్షలకు 10 కేంద్రాలు కేటాయిం చారు. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు నరసరావుపేటలోని ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో వసతుల కల్పనపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పగడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బుద్ధిలేని అబద్ధాల కోరు జగన్‌రెడ్డి: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బుద్ధి, జ్ఞానం లేని అబద్ధాల కోరు జగన్మోహన్‌రెడ్డి అని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు, రెచ్చగొట్టడం, చంపడం, పరామర్శించడం వంటివి ఉంటేనే జగన్ రాజకీయాలు చేయగలడని ఆరోపించారు. మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం అమ్ముతున్నట్లు బుద్ధిలేని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ మోడల్‌కు, ప్రైవేట్ వ్యక్తులకి అంట గట్టడానికి తేడా తెలిసినా జగన్ రెచ్చగొట్టే రాజకీయాలు చేయాలనుకుంటున్నాడని దుయ్యబట్టారు. సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి పర్యటనల పేరుతో మూకలను రెచ్చగొట్టి తలలను కార్ల టైర్లతో తొక్కించి చంపి రాజకీయం చేయాలనుకున్నా రని ఆరోపణలు చేశారు. ఇప్పుడు విశాఖలో మహిళల వన్డే ప్రపంచ కప్ జరుగు తుంటే దానిని భంగం కలిగించాలనే దురుద్దేశంతో కూటమి ప్రభుత్వంపై అంత ర్జాతీయంగా బురద చల్లాలనే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. జగన్ లాంటి అరాచక శక్తులు రోడ్లపై తిరిగితే ప్రజలకు ప్రమాదం, రాష్ట్రానికి వినాశనమేనని.. జగన్‌ను ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00


50,096 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,707 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,096 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,520 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12200
334	10000	14500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14000	334	10500	14600
273	---	---	నెంబరు. 5	10000	14000
341	10000	15000	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	---	----	4884	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10000	15400	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

గుంటూరు సిటీ వార్తలు

జగన్ కల్తీ మద్యానికి బలైన పేదలు



● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యానికి మూల కారకుడు మాజీ సీఎం జగనేనని, ఆ మద్యం వల్ల వేల మంది పేదలు బలయ్యారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ గుంటూరు నగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటూ, పలువురిని అరెస్టు చేసి, చట్టవిరుద్ధ చర్యలపై ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోందని చెప్పారు. కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దాసరిపల్లి జయచంద్ర రెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ నుంచి సస్పెండ్ చేసి, తగిన విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని డేగల గుర్తుచేశారు. ఎవరో ఎక్కడో తప్పు చేస్తే దాన్ని ప్రభుత్వానికి, పార్టీకి అంటగట్టేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో విజయవాడలో మీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంబంధించిన బార్‌లో కల్తీ మద్యం వల్ల ఆరుగురు చనిపోతే ఆయన్ని ఎందుకు సస్పెండ్ చేయలేదు? అంటూ నిలదీశారు. జగన్ ఐదేళ్ల పాలనలో విష పూరిత మద్యం తయారు చేసి రూ.3500కోట్లు కొల్లగొట్టారన్నారు. కల్తీ మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించబోదని డేగల స్పష్టం చేశారు.

ఇంటాక్ వర్కుషాపులో ఏపీ బృందం



ఢిల్లీలో ఇంటాక్ ఏపీ బృందం సభ్యులు

గుంటూరు(విద్య), అక్టోబరు 8 ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఇంటాక్ సభ్యుల బృందం బుధవారం ఢిల్లీలో జరిగిన వర్కుషాపులో పాల్గొన్నారు ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఢిల్లీలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏపీ లోని పలు ప్రాంతాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. బృందంలో సభ్యులు డాక్టర్ జాన్సీ వీరాంజనేయులు, మేకల రవీంద్రబాబు, ఎన్ సుకీర్తి, కే ప్రవీణ, డాక్టర్ రేణుకారాణి, ఎస్ మహిపాల్‌రెడ్డి, ఈ రమేష్ ఎం వెంకటసుబ్బారెడ్డి, నాగభూషణం, వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలి

● రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న పనతల సురేష్, పాల్గొన్న బీజేపీ నాయకులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అన్నారు. స్థానిక లాలుపురంలోని వాజ్‌పేయి భవనంలో బుధవారం ఆ పార్టీ ఎస్సీ మోర్చా జోనల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీలని అన్ని మోర్చాల కంటే ఎస్సీ మోర్చా చాలా కీలకమన్నారు. దానిని అభివృద్ధి చేయగలిగితే రాష్ట్రంలో బీజేపీ మరింతగా పుంజుకుంటుదని అన్నారు. జోన్ ఇన్‌చార్జ్ మట్టా ప్రసాదు మాట్లాడుతూ ఎస్సీ మోర్చాలో అన్ని విభాగాల్లో నాయకుల అవసరముందని తెలిపారు. త్వరలోనే ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, దేసు సత్యనారాయణ, చరకకుమార్, దారా అంబేద్కర్, చింతల అనిల్, స్టాలిన్ బాబు, ఆనందరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైల్ విహార్‌లో గ్రీన్ కారిడార్



రైల్ విహార్ కాలనీలో మొక్కలు నాటిన డీఆర్ఎం, ఇతర అధికారులు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని రైల్ విహార్ కాలనీలో గ్రీన్ కారిడార్‌ని అభివృద్ధికి రైల్వే గుంటూరు డివిజన్ శ్రీకారం చుట్టింది. బుధవారం డీఆర్ఎం సుదేష్ణసేన్ నేతృత్వంలో వివిధ విభాగాల అధికారులు కాలనీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రైల్ విహార్ కాలనీలో పెంపొందించడమే లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు ప్రదీప్‌కుమార్, కమలాకర్‌బాబు, మద్దాళి రవికిరణ్, షాబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై నిర్లక్ష్యం

● మొక్కలు పంచరు.. నాటరు...
● కొందరు సచివాలయం సిబ్బంది తీరుపై విమర్శలు



సిబ్బంది నిర్లక్ష్యానికి ఎండిపోయిన మొక్కలు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపొందించాలని ప్రజాప్రతినిదులు, అధికారులు పదే పదే చెబుతున్నా కొందరు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పచ్చదనం పెంపొందించేలా ప్రజలకు వివరించాల్సిన సచివాలయ ఉద్యోగులు కొందరు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు నగరపాలక సంస్థ మొక్కలను పెద్ద ఎత్తున పంపిణీ చేసింది. నగరంలో సచివాలయాలకు కొంత వరకు మొక్కలను అందజేసి వారు నాటటంతో పాటు ప్రజలకు పంపిణీ చేసేలా సూచనలు చేశారు. ఇందులో భాగంగా నల్లపాడు రోడ్డు శ్రీలక్ష్మీనగర్ మొయిన్ రోడ్డులోని రెండు సచివాలయాలకు మొక్కలను పంపించారు. ఆయా మొక్కలను సచివాలయ సిబ్బంది నాటలేదు సరి కదా కనీసం ప్రజలకైనా పంపిణీ చేయలేదు. కార్యాలయం కిందనే అలానే వదిలేయటంతో ఎండకు ఎండిపోయాయి. దీనిపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పచ్చదనం పెంపొందించాల్సిన వారే నిర్లక్ష్యంగా వదిలేయటం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. పర్యావరణం, పచ్చదనం పెంపొందించాలంటూ పదేపదే ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొందరు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో అసలు లక్ష్యం దెబ్బతింటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

‘పశ్చిమ’ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునీయండి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



కలెక్టర్ తమీమ్ అన్సారియాతో ఎమ్మెల్యే గళ్లా మాధవి దంపతులు



ఎస్పీ వకుల్ జిందాల్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి కలెక్టర్‌ను కోరారు. ఇటీవల గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారీయాను ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు మొక్కను బహూకరించారు. అనంతరం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.

● గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్‌ను ఎమ్మెల్యే మాధవి మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను బహూకరించారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడేందుకు తోడ్పడాలని, గంజాయి, అల్లరి మూకల ఆగడాలను కట్టడి చేయాలని ఎస్పీని కోరారు.

మహిళ సాధికారతే నా లక్ష్యం

మహిళా సాధికారతే తన లక్ష్యమని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆమె కూటమి పార్టీల మహిళా నేతలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం ప్రత్యేకంగా ‘మహిళా గ్రీవెన్స్’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న మహిళల సమస్యలను నేరుగా విని పరిష్కరించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని, నియోజకవర్గంలోని ప్రతి మహిళా తన సమస్యను ధైర్యంగా తన ముందుకు తీసుకురావచ్చని తెలిపారు. కూటమి మహిళా నేతలు తమ ప్రాంతాల్లో మహిళలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు అండగా నిలిచే నాయకులకే నిజమైన గుర్తింపు లభిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

రేపు, ఎల్లుండి జీఎస్టీ ప్రదర్శన, అమ్మకాలు

● తగ్గించిన ధరలతో పాటు దీపావళి ఆఫర్లతో గృహోపకరణాలు, బుక్స్, వాహనాల విక్రయాలు : ఎస్ జీఎస్టీ డీసీ శ్రీనివాసులు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ లో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో జీఎస్టీ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏర్పాటు చేశామని ఎస్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌ను శుక్ర, శనివారాలు రెండు రోజులు గుంటూరు ఏసీ కాలేజీ అసెంబ్లీ హాల్లో ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులు ఉదయం 10నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందని చెప్పారు. తగ్గిన జీఎస్టీ రేట్లను అనుసరించి ఎగ్జిబిషన్ కంసేల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్న పిల్లలు చదువుకునే పుస్తకాలు, నోట్ బుక్స్, గ్రాఫ్‌లు, పెన్సిల్స్ రబ్బర్లు, పెన్స్, గృహ ఉపకరణాలు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్స్ స్కూటర్స్, మోటార్‌సైకిల్స్, కార్లు, ఇతర వాహనాలు తగ్గించిన ధరలతో పాటు దీపావళి ఆఫర్లతో విక్రయిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

హిందూమత ఉన్మాద ఫలితమే ఈ దాడి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



నిరసనల్లో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హిందూమత ఉన్మాద ఫలితమే జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం లాడ్జిసెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మతాల పేరుతో బీజేపీ భారతదేశ ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని మండిపడ్డారు. ఈ నిరసనల్లో ఆకిటి అరుణ్‌కుమార్, జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతురావు, వలీ, చిన్నా, విరిగినేని వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వరరెడ్డి, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఏకతాటిపైకి రావాలి : కేవీపీఎస్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించేందుకు లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఏకతాటిపైకి రావాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నవీన్ ప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక లాడ్జీ సెంటర్లో బుధవారం జరిగిన నిరసనల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, డీబీఎఫ్ వ్యవస్థాపకుడు కె.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచగవ్య తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సీపీఐ నారాయణ



మెల్లెంపూడిలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో పంచగవ్య తయారీ కేంద్రాన్ని బుధవారం సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పంచగవ్య తయారీ కేంద్రం యజమాని సురేంద్రరెడ్డి పంచగవ్య తయారీ విధానం, ఉపయోగాల గురించి నారాయణకు వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయానికి పంచగవ్య వాడకం ఎంతో మే లు చేస్తుందన్నారు. నేల సారాన్ని పెంచి, ఆరోగ్యకరమైన పం టలు పొందడానికి సహాయపడుతుందన్నారు. సేంద్రియ సాగు రైతు ఆదాయాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు కళ్లం రాజశేఖరరెడ్డి, పెనుమాక పీఏసీఎస్ చైర్మన్ కళ్లం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ప్యాడిసన్‌పేటలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, సురేష్‌కుమార్

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని ప్యాడిసన్‌పేటలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర క్రిస్టినా శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు. కాటూరి మెడికల్ కళాశాల వైద్య బృందం రోగులను పరీక్షించి స్కానింగ్ అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. హార్వెస్ట్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డేవిడ్ యశ్వంత్, సుద్దపల్లి నాగరాజు, బోసు, బాబీ, రవీంద్ర, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్స్‌కు కుప్పలు తెప్పలుగా కేబుల్ వైర్లు

● తరచూ అగ్ని ప్రమాదాలతో భయాందోళన
● విద్యుత్‌శాఖ చర్యలు శూన్యం



విద్యుత్‌పోల్‌పై ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గుంటూరు నగరంలో విద్యుత్ పోల్స్‌కు కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల రెండు ప్రాంతాల్లో విద్యుత్ పోల్స్‌కు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు దగ్ధమై మంటలు చెలరేగటం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇంత జరుగుతున్నా విద్యుత్‌శాఖ అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేబుల్ వైర్లను విద్యుత్‌పోల్స్ కు ఏర్పాటు చేసుకునేందుకు ఆ శాఖకు అధికారికంగా కొన్ని కేబుల్ సంస్థలు చలానాలు చెల్లిస్తున్నాయి. అయితే కేవలం ఆదాయం మాత్రంగానే పరిగణి స్తున్న అధికారులు అసలు అధికారికంగా ఎన్ని ఉన్నాయి.. అనధికారికంగా ఎన్ని ఏర్పాటు చేశారన్న అంశాలను పరిశీలించటం లేదన్న విమర్శలు వినిపి స్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో కేబుల్ వార్ జరగటంతో అప్పట్లో అనధికారికంగా కేబుల్ వైర్లను తొలగించారు. అది కాస్త అప్పట్లో పెద్ద ఎత్తున రాజకీయంగా వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ వివాదం కాస్త సద్దుమణిగాక మళ్లీ యథావిధిగా కేబుల్ వైర్లు విద్యుత్‌పోల్స్‌కు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేశారు. ఇటీవల మూడు వంతెనల సమీపంలో విద్యుత్‌పోల్‌కు, అరండల్‌పేట పరిధిలో కూడా చిన్నపాటి ప్రమాదం జరగడం స్థానికుల్లో భయాందోళన కలిగించింది. అధికారులు, స్థానికుల అప్రమత్తతో పెద్ద ప్రమాదమే తప్పినట్లవుతుంది. కేబుల్ వైర్లు ఒకే పోల్‌కు అడ్డగోలుగా కట్టటం కూడా కారణాలుగా చెబుతున్నారు. కనీస నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్‌శాఖ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగించుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తపాలా వారోత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ సూపరింటెండెంట్ యలమందయ్య ఒక ప్రకటనలో కోరారు. బుధవారం నుంచి 14వ తేదీ వరకు ఆధార్ అప్‌డేట్ సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ క్యాంపులు గురువారం స్తంభాలగరువులోని విజ్ఞాన్ హైస్కూల్లో, 10, 11 తేదీల్లో పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్లో, 13, 14 తేదీల్లో విద్యానగర్, లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి జరిగే అఖిలభారత సీఐటీయూ మహాసభల జయప్రదానికి కార్మిక, ఉద్యోగ వర్గం సహకరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బ్యారర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గాన్ని సంఘటితం చేసేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ కార్యదర్శి వై నేతాజీ, రమణ, హుస్సేన్ వలి, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

● ధారునాయక్

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి వేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారునాయక్ పేర్కొన్నారు. మహిళా సంక్షేమం దిశగా దీపం-2 పథకం ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లు అందచేస్తున్నామని, తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే ప్రతీ విద్యార్థికి నగదును అందచేశామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు అందచేస్తున్నామన్నారు. అదే విధంగా ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సూపర్ హిట్ అయ్యింద న్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి భరోసాగా వాహన మిత్ర పథకం ద్వారా ఏడాది కి రూ.15 వేలు వారికి అందజేశామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వదిలి యువతకు మేలు చేసిన ప్రభుత్వమన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పాలన చేస్తున్నామని ఆయన అన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



ఆటోనగర్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, ఏపీఐఐసీ చైర్మన్ నరసింహారావు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆటోనగర్ ప్రాంత అభివృద్ధి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహారావుతో కలిసి బుధవారం ఆయన ఆటోనగర్‌లో పర్యటించారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా పారిశుధ్య పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో యూనియన్ నాయకులతో మాట్లాడారు. మరో పది రోజుల్లో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామని, అభివృద్ధి పనులకు స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని, దీని ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పించనుందని తెలిపారు. పూర్తి స్థాయి అభివృద్ధికి సుమారు కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామని, ప్రస్తుతం రూ.50 లక్షలతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఆటోనగర్‌ను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనదని స్పష్టం చేశారు.

బోడేపూడి నియామకం గుంటూరుకు గర్వకారణం



శ్రీశైలం దేవస్థానం పాలకవర్గం సభ్యుడిగా నియమి తుడైన సుబ్బారావుని అభినందిస్తున్న ధర్మపీఠం సంస్థ ప్రతినిధులు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వికాస్ నగర్‌కు చెందిన ఫినిక్స్ మాడ్యులర్ ఫర్నిచర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు బోడేపూడి వెంకటసుబ్బారావును శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమించడం నగరానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. బుధవారం ధర్మపీఠం సంస్థ ప్రతినిధులు వెంకటసుబ్బారావుని ఆటోనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పారు. సుబ్బారావుని అభినందించిన వారిలో ధర్మపీఠం సంక్షేమ సేవా సంఘం ఫౌండర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆల్ ఇండియా సలహామండలి సభ్యుడు డాక్టర్ గంటా సతీష్‌కుమార్, హైకోర్టు న్యాయ వాది డాక్టర్ రామకోటిరెడ్డి, జిల్లా కోర్టు న్యాయవాది, డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఫ్యాకల్టీ పరుచూరి కుమారి తదితరులు ఉన్నారు.

డ్రోన్ గస్తీతో చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడి

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకట్టడికి ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ప్రతి రోజు పోలీస్ అధికారులు, సిబ్బంది ‘డ్రోన్ గస్తీ’ నిర్వహిస్తున్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతి రోజు తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలు, గ్రామాల్లో డ్రోన్ గస్తీ చేపడుతూ పేకాట(జూదం), కోడిపందాలు, బహిరంగ మద్యపానం, గంజాయి సంబంధిత, ఇతర అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా బుధవారం వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లపాడు గ్రామంలో సీఐ రామానాయక్ తమ సిబ్బందితో డ్రోన్ గస్తీ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని డంపింగ్ యార్డు నందు కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా గమనించి, వారిపై దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.16 వేల 900 నగదును సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్య కలాపాలకు తావు లేదని, ఎవరైనా వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఇక నుంచి అన్ని ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.



మిర్చి యార్డులో దిగుమతి దుకాణాల చుట్టూ వర్షపు నీరు

వర్షమొస్తే.. క్రయవిక్రయాలు బంద్

● మిర్చి యార్డులో నిలిచిపోతున్న వర్షపు నీరు

గుంటూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షం కురిసిన ప్రతిసారి మిర్చి యార్డులో వరదనీరు భారీగా చేరి నిలబడిపోతోంది. దీంతో కమీషన్ ఏజెంట్లు దుకాణాల వద్దకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది. అలానే మిర్చి టిక్కీలు కూడా తడిసిపోయి రైతుకు నష్టం కలుగుతోంది. వర్షం నీరు నిలబడిన రోజున లావాదేవీలు ఆగిపోతున్నాయి. దీనంతటికి కారణం యార్డులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే. ఏటా రూ. 100 కోట్లకు పైగా ఆదాయాన్ని కూడబెట్టుకునే మిర్చి యార్డులో డ్రెయిన్లు చిన్నవిగా మారడంతో వర్షపు నీరు బయటకు ప్రవహించకుండా వేలం కేంద్రాల చుట్టూత చేరుతోంది. రాబోయే సీజన్‌ని దృష్టిలో పెట్టుకుని సత్వరమే డ్రెయినేజీ వ్యవస్థని మెరుగుపరచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.



ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

● ముగిసిన బ్రెజిల్ బృందం రాష్ట్ర పర్యటన

కొల్లిపర, గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవ సాయం' పనితీరు ప్రశంసనీయం అని బ్రెజిల్ బృందం పేర్కొంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు వారం రోజుల పాటు పర్యటించిన బ్రెజిల్, శ్రీలంక, యుఎఈ దేశాలకు చెందిన ప్రతినిధి బృందం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ పర్యటనలో చివరి రోజు బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామం, కొల్లిపర మండలం అత్తోట గ్రామాల్లో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. తొలుత నూతక్కి గ్రామంలో రైతు కల్లం శ్రీనివాసరెడ్డి పసుపు, అరటి పంటల ఏ -గ్రేడ్ మోడల్‌ను బ్రెజిల్ బృందం సందర్శిం చింది. రైతు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తమకు విలువైన పరిజ్ఞానం లభించిందని బృందం తెలిపింది. తక్కువ పెట్టుబడి, శ్రమతో అధిక దిగుబడి సాధించే తత్వాన్ని మెచ్చుకుంది. రసాయన, ప్రకృ తి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేసిన పసుపు పంటలను బృంద సభ్యులు పోల్చి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం క్షేత్రం జీవంతో నిండినట్లు కనిపించగా, రసాయన క్షేత్రాల్లో పంట ఆరోగ్యకరంగా లేనట్లు గమనిం చారు. అనంతరం బృందం అత్తోట గ్రామానికి వెళ్లి ఎస్. రోశయ్య అనే రైతులు సాగు చేస్తున్న అయిదు అంచెల ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను సందర్శించారు. ఈ క్షేత్రంలో వరి పంట బ్లాక్‌లో ద్రవ జీవామృతం ఉప యోగించిన విధానం తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ అధికారి లక్ష్మ నాయక్ రైతులు సాగు చేసిన మోడల్స్ గురుంచి వివరించారు. చివరిగా భూమి భారతి శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న ఘన జీవామృతాన్ని బృంద సభ్యులు స్వయంగా తయారు చేశారు. ఆర్‌వై ఎస్ఎస్ సీనియర్ అధికారి వాణిశ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో బ్రెజిల్ బృందం

పక్షం రోజులకోసారి ఎంపీడీఓల పనితీరుపై సమీక్ష

● జడ్పీ సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పక్షం రోజులకు ఒకసారి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓల పనితీరు పై టూర్ డైరీ ఆధా రంగా సమీక్ష నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు తెలిపారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అనే అంశంపై ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ సీఈఓ మాట్లాడుతూ ఎంపీడీఓ ల టూర్ డైరీ గతంలో మాదిరిగా యాంత్రికంగా కాకుండా ప్రతి అడుగూ గ్రామీణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ సాధించే దిశగా ఉండాలన్నారు. చెత్త సేకరణ అంశంలో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే నంబరు వన్ స్థానం లో ఉందని సీఈఓ వెల్లడించారు. అయినా.. ప్రజల సంతృప్తి స్థాయిని 95 శాతానికి చేరుకునేలా చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ రథం పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా ఎంపీడీఓలదే అని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయికుమార్ మాట్లాడుతూ చేసిన పనిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు పరచకపోతే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

ఎంపీడీఓలపై సీఈఓ ఆగ్రహం

సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సీరియస్‌గా మాట్లాడు తుండగా.. కొందరు ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు ముచ్చట్లతో మునిగిపోవడాన్ని సీఈఓ గమనించారు. ప్రభుత్వం ఎంతో మంచి లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తే కొందరు ముచ్చట్లు పెట్టుకోవడం, మరికొందరు సెల్ ఫోన్లలో మునిగిపోవడం ఏంటని నిలదీశారు. ఇలా ఇష్టానుసారం ప్రవర్తించే వారిపై కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీఓ నాగసాయి కుమార్

నివేదికలు సరైన సమయంలో పంపని అధికారులకు కూడా సీఈఓ జ్యోతి బసు హెచ్చరికలు జారీ చేశారు. నిర్లక్ష్యంగా ఉంటే పేపర్‌పై పెన్ను పెట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ఏఓల ప్రమోషన్ ఫైల్‌కు మోక్షం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో జడ్పీ సీఈఓ చర్యలు

● నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం

గుంటూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో ఐదు నెలలుగా నిలిచిన ఏఓల ప్రమోషన్ ఫైల్‌లో కదలిక వచ్చింది. జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు ప్రమో షన్ల వ్యవహారంపై చర్చించేందుకు బుధవారం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా సెక్షన్ల ఏఓలు శామ్యూల్ పాల్, రాజా రత్నం, పూర్ణ చంద్రారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కూచిపూడి మోహన్‌రావు పాల్గొన్నారు. 12 ఖాళీల్లో 11 పోస్టులను ప్రమోషన్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. 30 మంది సీనియర్ అసిస్టెంట్ లతో ప్యానల్ రూపొందించి.. వారిలో ప్రస్తుతం అర్హత కలిగిన 11 మందికి ప్రమోషన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి సంబం ధించిన ఫైల్‌ను వెంటనే సిద్ధం చేసి తనకు పంపాలని సీఈఓ ఏ సెక్షన్ అధికారులను ఆదేశించారు. సీఈఓ పరిశీలన అనం తరం ఈ ఫైల్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వద్దకు వెళ్లనుంది. ఆమె అనుమతి పొందిన తర్వాత ప్రమోషన్ ఉత్తర్వులు వెలువడనున్నాయి. గురువారం సాయంత్రానికి ప్రమోషన్ ఫైల్‌కు మోక్షం లభించనుంది.

రేపు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం 8వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రమణరావు, సత్యనారాయణ బుధవారం తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. అండర్-25 నుంచి అన్ని విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రీడా కారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఆస్తిపన్ను.. ఆన్‌లైన్ చెల్లింపుల్లో వెనకడుగు!

అవగాహన కల్పనలో చొరవ చూపని పంచాయతీ కార్యదర్శులు

పిడుగురాళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను చెల్లింపునకు ప్రభుత్వం కొత్త విధానం అమలులోకి తెచ్చింది. కానీ, చెల్లింపుదారులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో గ్రామ పంచాయతీలు వసూళ్లలో వెనుకబడి పోతున్నాయి. ఇప్పటిదాకా గ్రామాల్లో ఆస్తి పన్ను చెల్లించాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సంబంధిత కార్యదర్శికి నగదు చెల్లించి, రసీదు తీసుకునేవారు. ఆ విధంగా చెల్లించిన రసీదులు ఎంతోకాలం భద్రపరచలేక పన్నుదా రులు ఇబ్బంది పడేశారు. రసీదులు కనిపించకపోతే.. మొత్తం పన్ను చెల్లించాలంటూ.. పంచాయతీ కార్యదర్శులు గృహ యజమానుల ముక్కు పిండి వసూలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పన్ను వసూళ్లలో సిబ్బంది కూడా చేతివాటం ప్రదర్శించేవారు. ఖజానాకు నగదు జమచేయకుండా సొంతానికి వాడుకునేవారు. మరికొందరు కార్యదర్శులు నకిలీ రసీదులు గృహ యజమానులకు అందించి ఆ నగదును సొంతానికి వాడుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి అవకత వకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆస్తి పన్నుకు డిజిటల్ నంబరును కేటాయించింది. యూపీఐల ద్వారా లేక ఆన్‌లైన్‌లో డిజిటల్ నెంబరు ఆధారంగా.. ఆస్తి పన్ను చెల్లించే అవకాశం కల్పించింది. స్వర్ణ పంచాయత్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఇన్ లాగిన్ హౌస్‌టాక్స్ పేమెంట్ అనే వెబ్ సైట్‌లో ఆస్తి పన్నును చెల్లించుకునే విధంగా పోర్టల్‌ను రూపొందించారు. ఈ పోర్టల్ ఓపెన్ అయ్యాక సంవత్సరం, జిల్లా, మండలం, పంచాయతీ ఎంపిక చేసుకొని ఆస్తి అసెస్‌మెంట్ నంబర్, యజమాని పేరు, డోరు నంబరు ద్వారా ఏదో ఒకటి ఎంపిక చేసుకొని ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా పన్నును చెల్లించుకునే విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ అందుబాటులోకి తెచ్చింది. పన్ను చెల్లించాక రసీదు పొందే విధానం కూడా ఉంది.

తగ్గిన అవగాహన..

గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో.. పంచాయతీరాజ్‌శాఖ తీసుకొచ్చిన నగదు రహిత లావాదేవీల విధానంపై అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు వెనుకబడి ఉన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా తమ వద్దకు వచ్చిన వారికే ఆన్‌లైన్ చెల్లింపు చేసి రసీదు ఇస్తున్నారు. కార్యా లయాలకు రాకుండా నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతో పాటు మార్చి నాటికి ఆస్తిపన్ను చెల్లింపులు త్వరితగ తిన వసూలవుతాయనే ఆలోచనలో వెనుకబడ్డారు.



అదృష్టం బాగుండి బయటపడ్డారు..లేకుంటే!



బస్సుపై పడ్డ విద్యుత్ స్తంభం

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అదృష్టం బాగుండి 35 మంది ప్రయాణికులు భారీ ప్రమాదం నుంచే బయట పడ్డారు. గుంటూరు నుంచి ప్రయాణికులతో అమరావతికి ఏపీ 39యూజడ్ 5677 నంబరు గల ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు వస్తోంది. ఈ క్రమంలో ఎండ్రాయి గ్రామ సమీపంలో రోడ్డు వెంబడి 33 కెవీ విద్యుత్ స్తంభం కూలి ఒక్కసారిగా బస్సుపై పడింది. స్తంభం పడే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు భారీ ప్రమాదం తప్పింది. ముందుగా చింతచెట్టు కూలి విద్యుత్ తీగలమీద పడటంతో ఆ ధాటికి స్తంభం కూలింది. చెట్టు తీగలపై పడగానే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి కరెంటు పోయింది. దీంతో బస్సుకు విద్యుత్ సరఫరా కాలేదు. స్తంభం పడగానే.. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనతో కిందకి దిగిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసు, విద్యుత్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని.. బస్సుపై పడ్డ స్తంభాన్ని తొలగించారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంది గామ జడ్పీ హైస్కూల్లో బుధవారం పల్నాడు జిల్లా సెపక్ తక్రా జూని యర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు జిల్లా నలు మూలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు కార్యదర్శి పీ శివరామకృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికల ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, కే కిరణ్ కుమార్, అనీల్ దత్త నాయక్, కోచ్‌లు చిరంజీవి, రవి, శివలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు మెరుగుపరచాలి : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. నిందితులకు శిక్షలు పడేవిధంగా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, సీజ్ చేసిన మాదకద్రవ్యాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఎస్పీ సూచించారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు విధించేందుకు, దర్యాప్తు అధికారులు స్పష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలనే దిశగా దృష్టి సారించాలని సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఈగల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' లో భాగంగా జిల్లా శిక్షణ కేంద్రం ఈగల్ విభాగం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ల రైటర్లు, ఈగల్ విభాగ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నియం త్రణ చట్టం ప్రకారం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సీజ్, స్టోరేజ్, శాంపిలింగ్, డిస్పోజల్ వంటి దశల్లో పాటించ వలసిన చట్టపరమైన విధానాలపై సవివరంగా అవగాహన కల్పించారు.

విద్యార్థుల ఉత్తీర్ణతే ఉపాధ్యాయుల విజయం

● జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

వినుకొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థుల ఉత్తీర్ణతే ఉపాధ్యాయుల విజయానికి కొలమానమని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. వినుకొండ మండలంలోని వివేకానంద డీఎడ్ కాలేజీలో మెగా డీఎస్సీ - 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం కలెక్టర్ పాల్గొన్నారు. నూతన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లల నేపథ్యాన్ని గుర్తించి పాఠాలు బోధిం చాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు సాయం చేస్తూ చదువుకునే పేద పిల్లలకు.. కార్పొరేట్ స్కూల్స్‌లోని పిల్లలకు తేడాలుంటాయన్నారు. విద్యార్థులను ప్రతిభ ఆధారంగా తరగతులుగా విభ జించి.. అందరినీ ఉత్తీర్ణులను చేయాలన్నారు.

నరసరావుపేట శిక్షణ కేంద్రం డీఈఓ తనిఖీ

గుంటూరు(విద్య), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నరసరావు పేట వాగ్దేవి జూనియర్ కాలేజీలోని రామన్ భవన్‌లో జరుగుతున్న నూతన ఉపా ధ్యాయుల శిక్షణ తరగతులను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులందరూ మారు తున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఇన్‌చార్జిలు ఎండీ ఖాసీం, గోవిందరాజులు, వెంకటరావు, సుధా రాణి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఉపాధిలో బోగస్‌కు చెక్

జాబ్ కార్డులకు ఈకేవైసీ

ముఖ ఆధారిత హాజరుతో..అర్హులకు న్యాయం

సత్తెనపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో బోగస్‌ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనర్హుల జాబ్ కార్డులను తీసివేయడంతో పాటు దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలన్న ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. కార్డులను ఈకేవైసీ చేయాలని ఆదేశించడంతో.. డ్వామా అధికారులు సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ఈ ప్రక్రి యలో నిమగ్నమయ్యారు. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో బోగస్ మస్టర్ల మాయా జాలం వెలుగు చూస్తోంది. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న కూలీలకు, వాస్తవంగా హాజరవుతున్న సంఖ్యకు పొంతన ఉండడం లేదు. పలు చోట్ల బోగస్ హాజరును నమోదు చేస్తున్నారు. అటు వంటి వారి పేర్లతో హాజరు వేసి నిధులు దిగమింగుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేపట్టింది. అలాగే ముఖ హాజరు అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల పథకంలో యంత్రాల వినియోగంతో పాటు పని ప్రదేశాల మార్పు, దొంగ ఫొటోలు, ఒకరికి బదులు మరొకరు పనులకు రావడం, కూలీల సంఖ్యను అధికంగా చూపటం వంటి వాటికి బ్రేక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు నకిలీ జాబ్ కార్డులు వెలుగు చూసే అవకాశం ఉంది.



తగ్గనున్న మెటీరియల్ కోటా నిధులు

ఉపాధి హామీ పథకం ద్వారా చేసే మొత్తం పనుల అంచనాలో 60 శాతం కూలీలు చేయాల్సి ఉంది. మిగతా 40 శాతం నిధులను కేంద్రం మెటీరియల్ కోటా కింద ఇస్తుంది. కూలీలు చేసిన పని ప్రకారమే మెటీరియల్ కాంపొండెంట్ నిధులు వస్తాయి. కూలీల సంఖ్యను పెంచాలని అధికారుల పై ఒత్తిడి ఉండటంతో ఇప్పటి వరకు ఏదో విధంగా కూలీల నమోదు అధికంగా చూపుతున్నారు. వేలి ముద్రలు, ముఖ ఆధారిత డిజిటలైజేషన్ కార్యక్రమం ద్వారా బోగస్ కూలీల సంఖ్య తగ్గి పోనుంది. దీంతో మెటీరియల్ కాంపొండ్ నిధులు కూడా తగ్గి పోతాయని పలువురు అంటున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ వివరాలను ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామాల్లో నమోదు చేస్తున్నారు. కూలీల వేలి ముద్రలు, ఐరిష్, ముఖం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీని వల్ల నిజమైన కూలీలకు న్యాయం జరుగుతుంది. చేసిన పనిని బట్టి కూలీలకు అధిక వేతనం కూడా లభిస్తుంది.

బండారుపల్లి పోలేరమ్మ ఆలయంలో చోరీ

తాడికొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బండారుపల్లి పోలేరమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీ పగలగొట్టి డబ్బులు దోచుకెళ్లారు. దేవాలయం పూజారి గుంటుపల్లి సాంబశివరావు ప్రతిరోజు లాగానే దేవాలయంలో దీపారాధన చేయటానికి బుధవారం ఉదయం గుడి తలుపులు తీయగా హుండీ తాళం విరిగిపోయి కనిపించింది. వెంటనే గుడిలో సీసీ కెమెరాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి హుండీ పగలగొట్టి డబ్బులను దొంగతనం చేసినట్లు గమనించారు. వెంటనే తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జిత్యానాయక్ తెలిపారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన జర్మనీ బృందం

ఫిరంగిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు, 113 తాళ్ళూరు గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాలను జర్మనీ బృందం బుధవారం పరిశీలించింది. కార్యక్రమంలో డాక్టర్ గెరాల్డ్ రెహ్మాన్, డాక్టర్ ఎల్ సుధాకర్, డాక్టర్ జీ వరలక్ష్మి, మంజీర, లావణ్య, చింత వర ప్రసాదు, 113 తాళ్ళూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు డి.సీతారామయ్య, వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు తిరుపతిరావు, జె.రామకృష్ణ, లక్ష్మారెడ్డి, అమల, తిరుపతమ్మ, సజ్జారావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి రెండు బస్సు సర్వీసులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు మంగళగిరి డిపో నుంచి అమరావతి రూటులో రెండు కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించినట్టు మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజరు పిచ్చియ్య తెలిపారు. మంగళగిరి నుంచి ప్రతిరోజు ఈ సర్వీసులు నడుస్తాయని, ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలలకు సంచార గ్రంథాలయం

మంగళగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య సంచార గ్రంథాలయం బుధవారం పలు పాఠశాలలను సందర్శించింది. పాత బ్యాంకు కాలనీలోని కేకే మున్సిపల్ హైస్కూల్, కుప్పురావు కాలనీ గేటు వద్ద గల రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్, నవులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద సంచార గ్రంథాలయాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

తుళ్లూరు (వెలగపూడి, మందడం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మందడం, వెలగపూడిలో రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

స్థానిక ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ పోటీ

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్రమంతటా పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీరా రమేశ్‌కుమార్ వెల్లడించారు. బుధవారం తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే వారు పార్టీ రాష్ట్ర కార్యాలయం ఫోన్ నెంబరు 7306123899కు సంప్రదించాలని కోరారు.

కార్మికులపై అదనపు పనిగంటల భారాన్ని విరమించుకోవాలి: కృష్ణ

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనివిధానాన్ని తుంగలో తొక్కుతూ 10 నుంచి 13గంటల వరకు పని గంటలు పెంచడం అన్యాయమని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీనియర్ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మెల్లెంపూడిలో పారిశుధ్య కార్మికులతో మస్టర్ పాయింట్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో షేక్ నాగుల్‌మీరా, ఈదులమూడి సతీష్, దుర్గాభవాని, కంచర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి: శంకర్‌నాయక్

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీజేఐపై జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు తీరని అవమానమని అన్నారు. సమావేశంలో గిరిజన సమాఖ్య (జేపీఎస్) నాయకులు పాత్లావత్ దుర్గనాయక్, ఇస్లావత్ హనుమంతు నాయక్, జరపల కృష్ణ నాయక్, మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

● ఫిరంగిపురం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయటం న్యాయ వ్యవస్థకు కళంకమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు అన్నారు. బుధవారం ఫిరంగిపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తురక ప్రసాదు, దాసరి సురేశ్, కాకి రామారావు, నూతలపాటి ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం కేఎల్ యూనివర్సిటీలో మానసిక ఆరోగ్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్ జి.హరిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వీసీ డాక్టర్ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే పనులను పరిశీలించిన జేసీ



మోతడకలో జరుగుతున్న రీసర్వేపై అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ్

తాడికొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతడక గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే చేయటం వల్ల రైతులకు మేలు కలుగుతుందని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో తమ భూమి వివరాలు సక్రమంగా నమోదు చేయటానికి రీ-సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సర్వేయర్లకు రైతులు సహకరించాలని కోరారు. సమస్యలు వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు తమ వద్ద ఉన్న భూ హక్కు పత్రాలను సర్వే చేసే సభ్యులకు అందజేయాలని జేసీ కోరారు. జేసీ వెంట తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్, తాడికొండ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హనుమంతరావు, వీఆర్వోలు, సర్వేయర్ల సిబ్బంది ఉన్నారు.

అనంతవరం, వడ్డమానులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు



వడ్డమానులో గ్రావెల్‌ను ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న పొక్లెయిన్

తుళ్లూరు, (అనంతవరం/వడ్డమాను) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం, వడ్డమాను గ్రామాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కొండలను కొల్లగొట్టి యథేచ్ఛగా జేబులు నింపుకుంటున్నారు. రాజధాని నిర్మాణ పనులు వేగవంతం కావడంతో గ్రావెల్‌కు డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా భావించిన కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎటువంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వి లారీలు, ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలకు మామూళ్లు అందటంతో వారు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనంతవరం గోశాలలో అధ్వాన పరిస్థితులు

● గోవులు చనిపోతున్నా పట్టించుకోని నిర్వాహకుడు ● పశుసంవర్ధకశాఖ నోటీసులు బేఖాతరు



అనంతవరం గోశాల ప్రాంగణంలో మృతిచెందిన గోవు, గోశాలలో నీళ్లు లేకుండా ఖాళీగా ఉంచిన టబ్‌లు

తుళ్లూరు, (అనంతవరం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతవరం గోశాల ప్రాంగణంలో అధ్వాన పరిస్థితులతో గోవుల పరిస్థితి దీనాతి దీనంగా ఉంది. అవనిగడ్డకు చెందిన తోట సురేష్ అనే వ్యక్తి వేంకటేశ్వ స్వామి ఆలయం సమీపంలో రెండెకరాల సీఆర్డీఏ భూమిని ఆక్రమించి గోశాలను ఏర్పాటు చేశాడు. రాజధాని భూములలో పంటలు లేకపోవటంతో పశుగ్రాసం అందుబాటులో ఉంది. దీంతో యజమానులు గోవులను మేతకు బయటకు వదిలేస్తున్నారు. గడ్డి దొరుకుతుండడంతో కొందరు బయటి ప్రాంతాల వారు కూడా ఆవులను తీసుకొచ్చి అక్కడ వదులుతున్నారు. అటువంటి గోవులను సురేష్ అక్రమంగా తోలుకుపోయి సంతలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వారం క్రితం మేత లేక గోవు ఒకటి చనిపోయింది. దాన్ని ప్రాంగణం పక్కనే సురేశ్ పూడ్చిపెట్టాడని ఆరోపిస్తూ అనంతవరం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గోవులను సురక్షిత ప్రాంతానికి చేర్చాలని సురేశ్‌కు పశుసంవర్ధకశాఖ మంగళవారం నోటీసులు జారీచేసింది. ఆవేమీ లెక్కచేయకుండా గోవులను అక్కడే వదిలేసి అతను వెళ్లిపోయాడు. దీంతో వాటికి మేత నీళ్ల లేక చిక్కి శల్యమవుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అనంతవరం గ్రామస్థులు కోరుతున్నారు.

పంచగవ్య తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సీపీఐ నారాయణ



పెనుమాకలో పంచగవ్య తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నారాయణ

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో పంచగవ్య తయారీ కేంద్రాన్ని బుధవారం సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పంచగవ్య తయారీ కేంద్రం యజమాని సురేంద్ర రెడ్డి పంచగవ్య తయారీ విధానం, ఉపయోగాల గురించి నారాయణకు వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయానికి పంచగవ్య వాడకం ఎంతో మేలు చేస్తుందన్నారు. నేల సారాన్ని పెంచి, ఆరోగ్యకరమైన పంటలు పొందడానికి సహాయపడుతుందన్నారు. సేంద్రీయసాగు రైతు ఆదాయాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పెనుమాక పీఏసీఎస్ చైర్మన్ కళ్లం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో 280 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు మంగళవారం విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,200, గరిష్ఠ ధర రూ. 10,500, మోడల్ ధర రూ.10,500 పలికాయి. కాయలు కనిష్ఠ ధర రూ.10,200, గరిష్ఠ ధర రూ.10,475, మోడల్ ధర రూ. 10,200 పలికాయి.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడికొండ (మం), రావెల గ్రామ కాపురస్తులు దండ అప్పారెడ్డి గారి కుమారుడు తండ్రి బ్రహ్మారెడ్డిగారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలు ఆస్తులు లేటు దండ వెంకట రెడ్డి గారికి వారసత్వంగా సంక్రమించినవని ఆట్టి ఆస్తులగురించి సదరు దండ వెంకట రెడ్డిగారు ఒక వీలునామాను వ్రాయించి సదరు వీలు నామాను ఎట్టి మార్పులు, చేర్పులు చేయకుండానే ది.07-09-2025న మరణించిన దరిమిల సదరు వీలునామాలోని అంశముల ప్రకారం దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులపై మా క్లయింటుకు హక్కులు సంక్రమించి యున్నవి. కానీ కొంత మంది సదరు ఆస్తులకు తప్పుడు దస్తావేజులు సృష్టించి సదరు ఆస్తులకు పట్టాదారు పాసుపుస్తకాలు వగైరాలు పొందుటకు ప్రయత్నము చేయు చున్నట్లుగా మాక్లయింటుకు తెలియవచ్చినది. కావున దిగువ షెడ్యూలుదాఖలా ఆస్తులపై మా క్లయింటుకు మాత్రమే హక్కులు కలవని ఎవరైనా తప్పుడు సంగతులతో ఎట్టి లావాదేవీలు జరిపినా మా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

షెడ్యూలు-1: గుంటూరు డి॥, తాడికొండ(మం), వరగాని గ్రామ సర్వే నెం.498/హెచ్ లో, సర్వే నెం. 498/ఇలో య.0.03 సెంట్లు, సర్వే నెం.498/డి లో య.1.29 సెంట్లు వెరశి య.1-50సెంట్ల మెట్ట భూమి.

షెడ్యూలు-2: గుంటూరు డి॥, కొల్లిపర (మం & గ్రా) సర్వే నెం.721-1ఇలో య.0.18 సెంట్లు, 721-1ఎఫ్‌లో య.0.29 సెంట్లు మరియు కొల్లిపర గ్రామం లోని ఆర్.సి.సి. డాబా మరియు య.0.04 సెంట్లు గల ఇంటి నివేశన స్థలము రెండు ప్లాట్లు.

పెరవలి రమేష్, పి. సుజాత, న్యాయవాదులు
5వ లైను, కన్నావారితోట, గుంటూరు. సెల్: 9849614298

చిల్లపల్లి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్

మంగళగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన ఈ వివాహ వేడుకల్లో వీరు పాల్గొని నూతన వధూవరులు చాముండేశ్వరి, సాయి వివేక్‌లను ఆశీర్వదించారు. లోకేశ్ నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ నూతన వధూవరులకు బొకే అందజేస్తున్న మంత్రి లోకేశ్,

పంటల ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి: సీపీఎం



మెల్లెంపూడిలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటల ముంపు నివారణ చర్యలు చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. బుధవారం మెల్లెంపూడిలో అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాలను సీపీఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, భారీ వర్షాలతో తాడేపల్లి మండలంలోని కుంచనపల్లి, గుండిమెడ, కొలనుకొండ, వడ్డేశ్వరం, మెల్లెంపూడి తదితర గ్రామాలలో పొలాలు ముంపునకు గురై దెబ్బతిన్నాయన్నారు. పంట కాలువలను శుభ్రం చేయించడంలో డ్రెయినేజీ బోర్డు నిర్లక్ష్యం వల్ల పంట పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉన్న పంట పొలాల కాలువ సర్వే చేయించి, పూడిక తీయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కంచర్ల సాంబశివరావు, రైతులు రమేష్‌రెడ్డి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో చిర్రావూరు విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలలో చిర్రావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 17 బాలికల విభాగంలో కె.సెల్సియ డిస్కస్ త్రోలో మొదటి స్థానం, షాట్‌ఫుట్, జావలిన్‌త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం అరుణశ్రీ తెలిపారు. షాట్‌పుట్ అండర్ 14 బాలుర విభాగంలో సుభాష్ ప్రథమ స్థానం, బాలికల్లో ఆర్.జాహ్నవి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలైన విద్యార్థులను గ్రామ పెద్దలు సీర్ల లాల్ చంద్, ఏఎంసీ చైర్మన్ భవాని, పీడీ సూర్యప్రకాశరావు అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వట్టిచెరుకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఆరు బైక్‌లు, రూ.17వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పల్లపాడు, సొపాడు బహిరంగ ప్రదేశాలను పోలీసులు బుధవారం డ్రోన్‌తో పరిశీలించి డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్న వారిని సీఐ రమా నాయక్, సిబ్బంది ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారినుంచి రూ.16,900 నగదు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమా నాయక్ వెల్లడించారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దివీస్ ల్యాబ్స్ సిబ్బంది

తాడికొండ (లాం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఫుల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్-2025 కార్యక్రమంలో భాగంగా బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీ.టెక్, బీఎస్సీ, ఎంఎస్సీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను చేపట్టినట్లు చెప్పారు. దివీస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.రామకృష్ణ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 25మంది విద్యార్థులు హాజరు కాగా 9మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ యూనిట్లలో పనిచేస్తారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు క్రీడలూ అవసరమే: ఎంఈవో

కాకుమాను, పెదనందిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అసరమేనని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) కేఏఫ్ కెన్నడీ అన్నారు. కాకుమాను ప్రభుత్వ పాఠశాల, పెదనందిపాడు మండలం నాగులపాడు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం, ఎత్తు, బరువు పరిశీలించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని హెచ్ఎంలకు సూచించారు.

ఆదర్శనీయుడు పౌలు: దొంతిరెడ్డి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం కోసం సీఐటీయూ జెండా అండతో తుదివరకు నిస్వార్థంగా పని చేసిన సీపీఎం నేత కటికల పౌలు ఆదర్శనీయుడైన సీపీఎం సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముగ్గురోడ్డులో సీఐటీయూ నాయకుడు కటికల పౌలు వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక శాఖ కార్యదర్శి దర్శనపు విజయబాబు, కోట బాబురావు, వెంపాటి సామ్యూల్, గోపమ్మ, ఫిరోజ్, లక్ష్మయ్య, దేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన

పెదనందిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో జీఎస్టీ 2.0 సంస్కరణలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, వైస్‌ప్రిన్సిపాల్ కె.ప్రతాప్, పీడీ పాతూరి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల: మండల కేంద్రం దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు కె. వీరయ్య, జి. నాగరాజు, ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, సరళాదేవి, ఎన్ఎస్ఎస్ సేవాసమితి కో-ఆర్డినేటర్ బి. రాంబాబు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

● తాడికొండ (మోతడక): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జీఎస్టీ పన్నుల తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ వీ.వీ. సుబ్బారావు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి జీ.రామచంద్రరావు, పాలిటెక్నిక్ బాధ్యులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

టిడ్కో గృహాల స్థితిగతులపై కమిషనర్ సమీక్ష

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రజల కోసం నిర్మాణం చేపట్టిన టిడ్కో గృహాల స్థితిగతులపై మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో, హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వైకుంఠపురం వద్ద, పూలే కాలనీలో నిర్మించిన, పూర్తి కాని గృహాల పరిస్థితిని తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజల వసతులు, సమస్యలు తెలుసుకున్నారు. పూలే కాలనీలో ఎంత విస్తీర్ణంలో ఎన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టింది ఆగిపోయిన దశలను సమీక్షించారు. ప్రభుత్వం పేదలకు ఇళ్లను ఇవ్వాలనే లక్ష్యాన్ని నిర్ధేశించుకోవడంతో టిడ్కో ఇళ్లపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, డీఈ భాస్కర్, సేతుబాబు తదితరులు పాల్గొన్నారు. ఐతానగర్‌లోని హెడ్ వాటర్ ట్యాంకును కమిషనర్ పరిశీలించారు. పట్టణంలో తాగునీరు సరఫరా విధి విధానాలను అధికారులతో మాట్లాడి ఏయే ప్రాంతాల్లో ట్యాంకులు నిర్మించింది. ఎంత పైపులైన్లు వినియోగిస్తున్నది, కృష్ణానది నుంచి వస్తున్న జలాల వివరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులు ఉన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

ఆయుర్వేద వైద్యం ప్రజలకు చేరువ కావాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యం ప్రజలకు చేరువ కావాలని విశ్రాంత ఏఎస్పీ పాండు రంగ విఠల్ కోరారు. రామలింగేశ్వరపేట ధన్వంతరి వైద్యశాలలో బుధవారం దేశీయ వైద్య సంఘం సభ్యత్వ నమోదు పత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యంలో ప్రవేశం ఉన్న ప్రతి ఒక్కరూ నమోదులో పాల్గొనాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో వైద్యులు వైద్యాన్ని వంశపారంపర్యంగా చేసే వారు సంఘాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయుష్ శాఖ ద్వారా ఆయుర్వేద వైద్యాన్ని ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించారని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా దేశీయ వైద్య సంఘానికి ఔషధ మొక్కలు పెంచేందుకు భూములు కేటాయించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, అంజిబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.


సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న విశ్రాంత ఏఎస్పీ పాండురంగ విఠల్

చీఫ్ జస్టిస్‌ను అవమానించడంపై నిరసన

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై న్యాయవాది చెప్పు విసిరి అవమానించడంపై ముత్తింశెట్టిపాలెం గ్రామస్థులు గ్రామంలో బుధవారం నిరసన తెలిపారు. సంబంధిత న్యాయవాదిని శిక్షించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ దారా రామకృష్ణ కోరారు. ఈ నిరసనలో మురళీ, క్రాంతి, సురేశ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంపై ఆటోడ్రైవర్లు హర్షం

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు సాయం అందించడం పట్ల ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. చినరావూరు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం వారు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు కోగంటి రోహిత్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేలు సాయం అందించడం అభినందనీయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడమే కాకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకం కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లవరపు విజయ్, జొన్నాదుల మహేశ్, అన్నం పిన్నారావు, రాములు నాయక్, లక్ష్మణ్, రాంచంద్, బాలకృష్ణ పాల్గొన్నారు.


క్షీరాభిషేకంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్యాడిసన్‌పేటలో ఉచిత వైద్య శిబిరం

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని ప్యాడిసన్‌పేటలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర క్రిస్టినా శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు. కాటూరి మెడికల్ కళాశాల వైద్య బృందం రోగులను పరీక్షించి స్కానింగ్ అవసరమైన వారికి ఉచితంగా స్కాన్ పరీక్షలు నిర్వహించారు. హార్వెస్ట్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డేవిడ్ యశ్వంత్, సుద్దపల్లి నాగరాజు, బోసు, బాబీ, రవీంద్ర, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, సురేష్‌కుమార్

ఘనంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే వేడుకలు

పొన్నూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో బుధవారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం మార్గ్‌లో ఉన్న మాజీ సైనిక ఉద్యోగ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు మస్తాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ అనంతరం నిడుబ్రోలు శాంథోం కరుణ నిలయంలో మాజీ సైనిక ఉద్యోగులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువులు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేశ్ బాబు, మాజీ సైనిక ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎయిర్ ఫోర్స్ డే వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ రమేశ్ బాబు, మాజీ సైనిక ఉద్యోగులు

ప్రభుత్వాసుపత్రిలో ఆరేళ్లుగా ఐ క్లినిక్ మూత

- గతంలో వేల మందికి కంటి పరీక్షలు
- ఉచితంగా కళ్ళ జోళ్ళ పంపిణీ
- సేవలు పునరుద్ధరించాలని కోరుతున్న ప్రజలు

పొన్నూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల ద్వారా ఉచిత కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ముఖ్యమంత్రి ఐ క్లినిక్ ఆరేళ్లుగా మూతపడి ఉంది. 2014-19 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని గుర్తించిన అప్పటి ప్రభుత్వం పేదలందరికీ కంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాసుపత్రుల్లో ముఖ్యమంత్రి ఐ క్లినిక్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా అన్ని రకాల కంటి పరీక్షలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించి వారికి అవసరమైన కళ్ళజోళ్లను ఉచితంగా పంపిణీ చేసింది. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేసింది. ఈ పథకాన్ని వేలాది మంది గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.


మూతపడిన నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ముఖ్యమంత్రి నేత్ర క్లినిక్

అపోలోతో ఒప్పందం పూర్తికావడంతోనే..

నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో ఐదేళ్లపాటు నిరాటంకంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడిన ఐ క్లినిక్ గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడింది. ఈ ఐ క్లినిక్ అప్పటి ప్రభుత్వం అపోలో హాస్పిటల్స్ సౌజన్యంతో టెలిమెడిసిన్ విధానంలో నిర్వహించింది. స్థానికంగా ప్రజలకు కంటి పరీక్షలు సాంకేతిక విధానంలో నిర్వహించి వాటిని అపోలో టెలి మెడిసిన్ విభాగం సాయంతో అనేకసార్లు విశ్లేషించి ప్రజలకు అవసరమైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందజేశారు. అయితే అపోలో హాస్పిటల్స్‌తో పెట్టుకున్నా ఒప్పందం పూర్తి కావడంతో దాని పొడిగింపునకు గత ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో సేవల నుంచి ఆ వైద్య సంస్థ తప్పుకుంది. ఆ నాటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఐ క్లినిక్ విభాగం పూర్తిగా మూతపడింది. ప్రస్తుతం ఆసుపత్రిలో కంటి వైద్యం అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలి వెళ్లి పరీక్షలు చేయించుకొని భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం తక్షణమే ముఖ్యమంత్రి ఐ క్లినిక్ సేవలను పునరుద్ధరించి కంటి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు పాలకులను విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

- మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో చిన్నతనం నుండే సృజనాత్మకతను పెంపొందించాలని, తద్వారా వారు భవిష్యత్తుకు చక్కని బాటలు వేసుకుంటారని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు అన్నారు. బుధవారం కార్యాలయంలో వెస్ట్‌బెర్రి పాఠశాల ఆధ్వర్యంలో 3 నుంచి 7 ఏళ్ల వయసు విద్యార్థులకు నిర్వహించే తెనాలి లిటిల్స్ ఐడిల్స్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపల్ టి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ పోటీల వల్ల చిన్నారులలో సృజనాత్మకతతో పాటు ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. పోటీలలో నృత్యం, సంగీతం, ఫ్యాన్సీ డ్రెస్, కథా, విన్యాసాలు వంటి విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. నవంబరు 8,9వ తేదీల్లో పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలి క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని కార్యాలయ అధికారులు వెల్లడించారు. మండల అధ్యక్షుడు ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల బడ్జెట్‌పై చర్చ జరుగుతుందని తెలిపారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి హేయం

- జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య తీవ్ర ఖండన

ఏఎన్‌యూ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడి ఘటనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య (ఎన్‌డీఎస్‌ఎఫ్) తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన లాయర్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎన్‌డీఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ రఘు, సెక్రటరీ ప్రశాంత్, కావ్య డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి ప్రధాన న్యాయమూర్తి పదవిని అలంకరించడం సహించలేని మనువాద భావజాలపు అరాచక శక్తులు ఈ దాడి వెనుక ఉన్నాయని వారు ఆరోపించారు. సుప్రీంకోర్టు ఉన్నది కేవలం మనుషులకు న్యాయం చేయడానికే కానీ దేవుళ్ళకు దేవతా విగ్రహాలకు కాదని అన్నారు. సుప్రీంకోర్టు పరిధిలోకి రానటువంటి అంశాలపైన న్యాయం చేయలేదని దాడులకు ప్రయత్నించడం మూర్ఖత్వమని పేర్కొన్నారు. ఈ దాడిని ప్రపంచదేశాలు కూడా ఖండిస్తున్నాయని తెలిపారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేనేజర్ ఆనంద్‌కుమార్

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో పెరిగిన కొనుగోలు శక్తి

- చెంచుపేట ఎస్‌బీఐ మేనేజర్

తెనాలి అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని చెంచుపేట ఎస్‌బీఐ మేనేజర్ ఆనంద్‌కుమార్ చెప్పారు. జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పన్ను తగ్గడం వల్ల ఎన్నో వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో వాటిని కొనుగోలు చేయగలుగుతున్నారని చెప్పారు. జీఎస్టీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, నవీన్, రోజ్‌లీన్, సాంబశివుడు, సుధాకరయ్య, వనజ పాల్గొన్నారు.

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో...

చేబ్రోలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ.రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. జీఎస్టీ 2.0 ద్వారా పన్ను చెల్లింపులలో ప్రజలకు కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. కామర్స్ అధ్యాపకుడు ఏవీ హనుమంతరావు, అర్థ శాస్త్ర అధ్యాపకుడు ఎం.ఏడుకొండలరావు జీఎస్టీ 2.0 ప్రాధాన్యం, ఉపయోగాలు విద్యార్థులకు వివరించారు. అనంతరం జీఎస్టీ 2.0 అంశంపై వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సచివాలయం సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.


విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

రైల్ విహార్‌లో గ్రీన్ కారిడార్

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని రైల్ విహార్ కాలనీలో గ్రీన్ కారిడార్‌ని అభివృద్ధికి రైల్వే గుంటూరు డివిజన్ శ్రీకారం చుట్టింది. బుధవారం డీఆర్‌ఎం సుధేష్ణసేన్ నేతృత్వంలో వివిధ విభాగాల అధికారులు కాలనీలో పెద్ద ఎత్తున మొక్క లు నాటారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రైల్ విహార్ కాలనీలో పెంపొందించడమే లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు ప్రదీప్‌కుమార్, కమలాకర్‌బాబు, మద్దాళి రవికిరణ్, షాబాజ్ హసూర్ తదితరులు పాల్గొన్నారు.


రైల్ విహార్ కాలనీలో మొక్కలు నాటిన డీఆర్‌ఎం, ఇతర అధికారులు

కొల్లిపరలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్లపైకి చేరిన మురుగునీరు


కొల్లిపరలో వర్షానికి జలమయమైన మెయిన్ రోడ్డు

కొల్లిపర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం రాత్రి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకువచ్చి ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీటికి మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. రెండు గంటలసేపు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. పలు చోట్ల పిడుగు పడటంతో ఇంట్లో ఉన్న టీవీలు, ఫ్యాన్‌లు పని చేయకుండా పోయాయి. మండల కేంద్రం కొల్లిపరలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోగా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులకు అసౌకర్యం కలిగింది. వాహనదారులు కూడ పలు ఇబ్బందులకు గురయ్యారు. అదే విధంగా మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తిపాలెం, తూములూరు, చివలూరు, జెముడుబాడు, దావులూరిపాలెం, అన్నవరంగౌడపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులు పడ్డారు. తూములూరు ఎస్సీకాలనీలో గృహాల చుట్టూ వర్షపు నీరు చేరుకోవడంతో గంటల తరబడి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.


కొల్లిపర మండలం తూములూరులో జలమయమైన సిమెంట్ రోడ్డు

పీడిత వర్గాల పక్షపాతి డాక్టర్ బాలగోపాల్

పొన్నూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): పీడిత వర్గాల పక్షపాతిగా డాక్టర్ బాలగోపాల్ గుర్తింపు పొందారని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ టి.రాజారావు కొనియాడారు. స్థానిక మానవ హక్కుల వేదిక కార్యాలయంలో బుధవారం డాక్టర్ బాలగోపాల్ 16వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బాలగోపాల్ విద్యార్థి దశ నుంచే హక్కుల ఉద్యమం వైపు నడిచారన్నారు. ప్రజల స్వేచ్ఛ, సమానత్వం కోసం హక్కుల చైతన్యాన్ని కలిగించారని గుర్తు చేశారు. దళిత ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం వారిపై జరుగుతున్న అఘాయిత్యాలపై పోరాడారని గుర్తు చేసుకున్నారు. అలాగే మతవాదాన్ని ప్రశ్నిస్తూ చివరి వరకు పీడిత ప్రజల పక్షపాతిగా నిలిచారని మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జిఎస్ రాయల్, తోడేటి శ్రీనివాస్, బలగాని వెంకటేశ్వర్లు, గారా మున్ని, షేక్ సుభాని, చొక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బాలగోపాల్‌కు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలు

- వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ ఖాన్

పొన్నూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. బుధవారం వైద్య సేవలు పారిశుధ్యంపై ఆసుపత్రిలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఫిరోజ్ ఖాన్ పారిశుధ్య సిబ్బందికి సూచించింది. ఆసుపత్రిలో వారానికి ఒకరోజు గైనకాలజీ సేవలు అందించేందుకు వేమూరు గైనకాలజిస్ట్‌ను డిప్యూటేషన్‌పై నియమించినట్లు చెప్పారు. అలాగే ఆసుపత్రిలో రెండు నెలల నుంచి అంబులెన్స్ సేవలు నిలిచిపోయిన నేపథ్యంలో మరో దానిని జిల్లా కలెక్టర్ కేటాయించినటట్లు ఫిరోజ్ ఖాన్ వివరించారు. ఆసుపత్రిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ ఖాన్

చినకరకట్ట రోడ్డుకు కోత

- యుద్ధప్రాతిపతికన మరమ్మతులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు

కొల్లిపర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అధికారుల అవగాహన లోపంతో ముం దస్తు ప్రణాళిక లేకుండా రేపల్లె కాల్వకు 2వేల క్యూసెక్కుల పైగా నీటిని విడుదల చేయడంతో చినకరకట్ట రోడ్డు కోతకు గురవుతున్నట్లు అనే శీర్షికను ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం స్పందించారు. రేపల్లె కాల్వకు నీటిని తగ్గించడంతో పాటు కొల్లిపర సమీపంలో బూత్‌మిల్ కాల్వ వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ఇరిగేషన్ ఎస్‌ఈ పీవీ రత్నం, ఈఈ సుధాకర్, ఏఈ బాబు, డీసీ వైస్ ఛైర్మన్ తోట ఏడుకొండలు సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపతికన కోతకు గురైన చోట మరమ్మతులు చేపట్టారు.


మరమ్మతులు చేపడుతున్న ఇరిగేషన్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేపు, ఎల్లుండి జీఎస్టీ ప్రదర్శన, అమ్మకాలు

- ఎస్ జీఎస్టీ డీసీ శ్రీనివాసులు

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో జీఎస్టీ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏర్పాటు చేశామని ఎస్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌ను శుక్ర, శనివారాలు రెండు రోజులు గుంటూరు ఏసీ కాలేజీ అసెంబ్లీ హాల్లో ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులు ఉదయం 10నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందని చెప్పారు. తగ్గిన జీఎస్టీ రేట్లను అనుసరించి ఎగ్జిబిషన్ కంసేల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్న పిల్లలు చదువుకునే పుస్తకాలు, నోట్ బుక్స్, గ్రాఫ్‌లు, పెన్సిల్స్, రబ్బర్లు, పెన్స్ గృహ ఉపకరణాలు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, సెల్‌ఫోన్స్, స్కూటర్స్, మోటార్ సైకిల్స్, కార్లు, ఇతర వాహనాలు తగ్గించిన ధరలతో పాటు దీపావళి ఆఫర్లతో విక్రయిస్తారని తెలిపారు.

డ్రోన్ గస్తీతో చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడి

గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ప్రతి రోజు పోలీస్ అధికారులు, సిబ్బంది 'డ్రోన్ గస్తీ' నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లపాడు గ్రామంలో సీఐ రామానాయక్ తమ సిబ్బందితో డ్రోన్ గస్తీ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని డంపింగ్ యార్డులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా గమనించి, వారిపై దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.16 వేల 900 నగదును సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అన్ని ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.